

రక్షా బంధన్



రక్షాబంధన్‌లో భాగంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు బ్రహ్మ కుమారీస్ ఆశ్రమ నిర్వాహకులు రక్షా బంధన్‌ను కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రక్షా బంధన్ కట్టి పుష్ప గుచ్ఛంతో సత్కరించారు.

– ప్రజాశక్తి, పార్వతీపురం

మంచంపట్టిన మన్యం



ఒకే మంచంపై చికిత్స పొందుతున్న రోగులు

- పెరుగుతున్న జ్వర పీడితులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

వర్షాకాలం వచ్చిందంటే చాలు గుమ్మలక్ష్మీపురం మన్యం వ్యాధులతో మంచాన పడుతుంది. ఏ గ్రామం చూసినా జ్వర పీడితులే మంచం పట్టి కనిపిస్తున్నారు. పారిశుధ్య లోపం, ఈగలు, దోమల వ్యాప్తి, కలుషిత నీరు, ఆహారం వల్ల ప్రజలు మలేరియా, వైరల్ జ్వరాల బారినపడుతున్నారు. వైద్యం కోసం వస్తున్న రోగులతో ఆసుపత్రులు కిట కిట లాడుతున్నాయి.

రోజు వారి ఒపి 150 పైనే

అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం కోసం భద్రగిరి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. వైద్యం కోసం ఎక్కువగా వస్తున్న వారిలో విద్యార్థులు, మహిళలు, వృద్ధులే ఉన్నారు. ఎక్కువ శాతం మంది జ్వరాలు, తలనొప్పి, కీళ్ల నొప్పులు వంటి వ్యాధుల లక్షణాలతో వైద్యం కోసం వస్తున్నారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. రోజువారి ఒపి 150పైగా నమోదు అవుతుంది. రోగుల సంఖ్య ఎక్కువగా ఉండి మంచాలు సరిపోకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురు రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఆసుపత్రుల్లో సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా రోగులకు అన్ని రకాలైన వసతులు కల్పించడంలో మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. దీంతో వైద్యం కోసం వెళ్తున్న విద్యార్థులకు సాధారణ పరీక్షలతోనే సరిపెడుతున్నారు.

ఆదివాసీ ఆరోగ్యం కనుమరుగు:...

గత ప్రభుత్వ హయాంలో ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు స్థానికంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఆదివాసీ ఆరోగ్యం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యా సంస్థలు మొదలుకొని కెజిహెచ్ వరకు హెల్త్ వాలంటీర్లను నియమించింది. ఆశ్రమ పాఠశాలలు, ఆసుపత్రుల్లో సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించింది. దీంతో పాటు ఐటిడిఎలో ఒక వైద్యాధికారి, మోనాటరింగ్ అధికారి ఉండేవారు. సీరియస్ కేసులను ఇక్కడ నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించే బాధ్యత వహించేవారు. దీంతో విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలందడంతో మరణాలు అదుపునకు వీలుండేది. ప్రభుత్వం మారాక హెల్త్ వాలంటీర్లను తొలగించడంతో పోయాయి. దీంతో విద్యార్థులకు స్థానికంగా వైద్యం అందక సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యం పొందుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఐటిడిఎ అధికారుల దృష్టి సారించాలి. ప్రభుత్వ నాడు నేడు పనులకు ఇస్తున్న ప్రాధాన్యత విద్యార్థుల ఆరోగ్యం పట్ల చూపడం లేదు. సకాలంలో వైద్యం అందక విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. ఎప్పటికైనా మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

కోలక అవినాష్
ఆదివాసీ గిరిజన సంఘం, జిల్లా కార్య దర్శి

వైద్య సేవలు కరువు...

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య సేవలందడం లేదు. గతంలో పనిచేసిన హెల్త్ వాలంటీర్లను ప్రభుత్వం తొలగించడంతో సేవలు కురువయ్యాయి. మరోవైపు విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదు. ప్రభుత్వం, ఐటిడిఎ అధికారులు స్పందించాలి.

- పల్లా సురేష్,
గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు







గుమ్మలక్ష్మీపురం మండలం బొడ్లగూడ, సీతంపేటలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు తిరుపతిరావు

బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలతో అవస్థలు

- సమరభేరిలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు
- పలుచోట్ల సంతకాల సేకరణ, ప్రచారం

ప్రజాశక్తి – గుమ్మలక్ష్మీపురం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం సమరభేరి కార్యక్రమంలో భాగంగా మండలంలోని మారుమూల ప్రాంతమైన బొడ్లగూడలో బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోడీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు పరిశ్రమల పేరుతో విచ్చలవిడిగా అనుమతులిస్తూ గిరిజనులను అడవి నుంచి దూరం చేసే కుట్ర పన్నుతున్నారని తెలిపారు. రాజ్యాంగం గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలను నిర్వీర్యం చేస్తూ గిరిజన జీవన విధానంపై పాలకులు దాడి చేస్తున్నారని విమర్శించారు. గిరిజనుల హక్కులు రక్షణకై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా తలపెట్టిన సమరభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా గ్రామ గ్రామానికి వెళ్లి ప్రజలను సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి దుడ్డుఖల్లు, మేదరగండ గ్రామాల్లో సమరభేరి కార్యక్రమంపై సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు మండంగి శ్రీనివాసరావు, సూర్యం, వెంకటరావు తదితరులు ఉన్నారు. అలాగే ఇరిడి, సప్ప గూడ, మల్లు, ఇచ్చాపురం, పెద్ద ఖర్జ, గ్రామాల్లో సిపిఎం మండల కార్యదర్శి కోలక అవినాష్ ప్రచారం నిర్వహించారు. సమరభేరి కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కురుపాం : మండలంలో గుమ్మడి గూడ, దండుసూర, షేక్ పాడు, తేనుఖరజ, గొటివాడ, నేరెళ్లవలస, దురిబిలి గిరిజన గ్రామాల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ప్రచారం, సభలు సమావేశాలు నిర్వహించారు. బుధ, గురువారాలు సంతకాల సేకరణ, సెప్టెంబర్ 1న సచివాలయం వద్ద వినతి, 4న తహశీల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నీలకంఠం, రామారావు, లక్షణ, రమేష్, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని ప్రధాన రహదారిలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అత్యధికంగా ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సంతకాలు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యమ్మల మన్మధరావు, జిల్లాకమిటీ గొర్లి వెంకటరమణ, రెడ్డి శ్రీదేవిలు మాట్లాడుతూ సమరభేరికార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 1న సచివాలయాలముందు, 4న తహశీల్దారు కార్యాలయాల ముందు నిరసన కార్యక్రమాల్లో ప్రజలంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.సన్యాసిరావు, బి.సూరిబాబు, మాన్యం గౌరీ, గెద్ద తులసి, చొక్కాపు చంద్రమౌళి, వేమకోటి ఈశ్వరరావు, గోవింద పండా, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో సమరభేరి కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల పెరిగిన అధిక ధరలు, నిరుద్యోగం, విద్యుత్‌ఛార్జీలకు నిరసనగా సమర భేరి కార్యక్రమంలో మండలంలోని కోసంగిలో సంతకాలు సేకరణ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎం.తిరుపతి రావు, జె.శ్రీరాములు, బి.నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై మండలంలోని చిన ఖర్జెల పంచాయతీ సీసాడ వలస, బట్టి వలస సర్వపాడు గ్రామాల్లో సమరభేరి కార్యక్రమంపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ నాయకులు కొల్లి సాంబమూర్తి, నాయకులు ఉపేంద్ర, శివుని నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో యువకులు గణేశు గౌర్నాయుడు, పోలినాయుడు, నరేష్, చిలకమ్మ తదితరులు ఉన్నారు.

పాచిపెంట : ప్రజా సమస్యలపై సమరభేరి కార్యక్రమం మండలంలోని కోడుమూరు, ఇప్పలవలస, చీడివలస, మెట్టవలసలో సిపిఎం నాయకులు సూకురు అప్పలస్వామి కొర్ర కళ్యాణ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. సమరభేరి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న ఆందోళనలకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు పాల్గొన్నారు.

సాలూరు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల పై ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్నె నాయుడు కోరారు. సమరభేరి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 6,7,8వార్డుల్లో ప్రభుత్వాల విధానాలపై సంతకాల సేకరణ చేశారు. నిరుద్యోగ యువత కోసం డిఎస్సీ నియామకాలు చేపట్టాలని, పట్టణాల్లో పన్నులు, విద్యుత్ ఛార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.రాముడు, సభ్యులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలో సుంకి, నాగూరు, చిలకాంలో సంతకాల సేకరణ సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యమ్మల మన్మధరావు, నాయకులు కరణం రవీంద్ర ఆధ్వర్యాన జరిగింది. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గేదెల రామ్మూర్తినాయుడు, ప్రకాశం, సాంబయ్య, శివ, సింహాచలం, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఎం సంతకాల సేకరణ చేపట్టింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కొల్లి గంగు నాయుడు, వి.ఇందిర మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజంతా పోరాడాలని, బుధ, గురువారాలు సంతకాల సేకరణ చేసి సెప్టెంబర్ 1న సచివాలయం వద్ద, 4న మండల కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ టి.ప్రభాకర్, నాయకులు పిట్టల సీతారాం, దాడి సింహాచలం, బిరుసు పాల్గొన్నారు.







మక్కువ, సాలూరు, పార్వతీపురంలో సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు గంగునాయుడు, ఇందిర, ఎన్‌వై నాయుడు, మన్మధరావు, వెంకటరమణ

తొలగించిన ప్రతి ఓటు పరిశీలన : కలెక్టర్

ప్రజాశక్తి – పార్వతీపురం

జిల్లాలో తొలగించిన ప్రతి ఓటు పరిశీలిస్తున్నామని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు పునశ్చరణ కార్యక్రమంపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తొలగించిన ప్రతి ఓటు పరిశీలించేందుకు ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు. జిల్లాలో ఇంటింటి ఓటరు విచారణ 0.19 శాతం మాత్రమే పెండింగ్ ఉందన్నారు. పాలకొండ నియోజకవర్గంలో 198633 ఓటర్లు ఉండగా 452 మందిని, కురుపాంలో 186700 ఓటర్లు ఉండగా 98 మందిని, పార్వతీపురంలో 187815 ఓటర్లు ఉండగా 93 మందిని, సాలూరు నియోజకవర్గంలో 197825 ఓటర్లు ఉండగా 822 మందిని పరిశీలించాల్సి ఉందని తెలిపారు. ఇంటింటి విచారణలో 4622 మంది లేనట్లు (ఆబ్సెంట్) గుర్తించామన్నారు. 3213 మంది శాశ్వతంగా ఆయా గ్రామాల నుంచి వెళ్లిపోయిన ఓటర్లను గుర్తించామన్నారు. అలాగే 13,994 మంది ఓటర్లు మృతి చెందినట్లు గుర్తించినట్టు చెప్పారు. 1861 డుప్లికేట్ ఓట్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. జిల్లాలో మొత్తం దరఖాస్తులు 95141 అందగా అందులో పాలకొండ నియోజకవర్గంలో 33382, కురుపాంలో 29195, పార్వతీపురంలో 12891, సాలూరులో 19673 ఉన్నాయని చెప్పారు. ఇందులో 1152 తిరస్కరించగా, 15139 అంగీకరించామని, 18228 ఓటరు జాబితాలో చేర్చామని, 60622 పెండింగ్‌లో ఉన్నాయని ఆయన వివరించారు. ఓటరు జాబితాలో దిద్దుబాటు కోసం ఫారం 8 కింద 60535 దరఖాస్తులు, ఫారం–6 కింద 16686, ఫారం 7 క్రింద 17920 దరఖాస్తులు అందాయన్నారు. ఏప్రిల్ 15 నుండి ఆగస్టు 29 వరకు 3365 ఓట్లు చేర్చ చేర్చామని, 2107 ఓట్లు తొలగించినట్టు తెలిపారు. అలాగే 12756 ఓటర్లు చేర్పులు, మార్పులు చేశామన్నారు. ఓటరు జాబితాలో తప్పులు గమనిస్తే దరఖాస్తు చేయవచ్చని, ఇవిఎంలు వస్తున్నాయని చెప్పారు. సమావేశంలో డిఆర్ఓ జె.వెంకట్రావు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



అట్టలి కొండలో ట్రాక్టర్లతో తరలిపోతున్న కంకర

కరిగిపోతున్న అట్టలి కొండ

- యథేచ్ఛగా తరలిపోతున్న కంకర
- చోద్యం చూస్తున అధికారులు

ప్రజాశక్తి – పాలకొండ , పాలకొండ రూరల్

అడవులు, కొండలు, వాగులు అక్రమార్కులకు అడ్డాగా మారుతున్నాయి. సహజ సంపదను దర్జాగా దోచుకుంటున్నారు. అడిగిన వాడు లేరని కొంత మంది వ్యక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి కొండలను కరిగిస్తున్నారు. ఎటువంటి అనుమతుల్లేకుండా కొండలను తవ్వుకుంటున్నారు. మండలంలో అట్టలి గ్రామంలో కొండను కొంత మంది వ్యక్తులు తవ్వుకుంటూ పోతున్నారు. కంకరను యథేచ్ఛగా తరిలిస్తున్నారు. రోజుకు వందలాది ట్రాక్టర్లతో కంకరను తరలిస్తున్నారు. జెసిబితో కొండను త్రవ్వి దర్జాగా రవాణా చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిబంధనులకు పాతరేసి కొండను కరిగిస్తున్నా పట్టించుకునే అధికారులు లేరు. పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఒక వ్యక్తి కంకరను లక్షలాది రూపాయలలో వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది. రోజుకు 50 నుంచి 60 ట్రాక్టర్లతో రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాడీవేడిగా నగర పంచాయతీ సమావేశం

ప్రజాశక్తి– పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ యందవ రాధా కుమారి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశం వాడివేడిగా జరిగింది. 20వ వార్డు కౌన్సిలర్ గంట సంతోష్ తన ప్రాంతంలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సీసాతో మురికి నీటిని తీసుకొచ్చి సభ్యులకు అధికారులకు చూపించారు. అదే విధంగా విద్యుత్ స్థంభాలు తమ వార్డులో వేయడాని ఒక వ్యక్తి అడ్డుకుంటున్నారని ఇది చాలా అన్యాయమని అన్నారు. కౌన్సిలర్ తానా లేదా ఆ వ్యక్త అని నిలదీశారు. 5వ వార్డు కౌన్సిలర్ వెలమల మన్మధరావు మాట్లాడుతూ గతంలో అప్పటి కమిషనర్ లిల్లీ పుష్పనాధం నగర్ పంచాయతీ స్థలాలు గుర్తించి బోర్డు పెట్టారని అయితే ఆ బోర్డులు, ఆ భూములు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైన దీనిపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, రౌతు హనుమంతురావు, కమిషనర్ సర్వేశ్వరావు తదితరులు ఉన్నారు.

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలి

ప్రజాశక్తి – పార్వతీపురం

బడి బయట ఉన్న పిల్లలను గుర్తించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థూల నమోదు నిష్పత్తి (గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో) సర్వేపై బుధవారం ఎంపిడిఒ, ఎంఇఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2005 సెప్టెంబరు 1 నుంచి 2018 ఆగస్టు 31 మధ్య జన్మించిన పిల్లలు పాఠశాలలో ఉండాలని స్పష్టం చేశారు. బడిబయట ఉన్న పిల్లల కోసం సర్వే నిర్వహించి తక్షణం నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సర్వేను ఎంపిడిఒలు, ఎంఇఒలు పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యా సర్వేలో ఇతర రాష్ట్రాలకు వెళ్లిన విద్యార్థులు, మృతి చెందిన విద్యార్థులు, కనిపించకుండా ఉన్న విద్యార్థుల వివరాలుంటే నమోదు చేయాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో సంక్షేమ, విద్యా సహాయకులు పర్యవేక్షణ చేసి వాలంటీర్ల ద్వారా సర్వే పూర్తి చేయాలన్నారు. సర్వేలో వాలంటీర్లు విధిగా విద్యార్థుల ఆధార్ సంఖ్య నమోదు చేయాలని, గ్రామంలో ఉన్నప్పటికీ బడి బయట పిల్లల జాబితా, 12వ తరగతి ఉత్తీర్ణులైన వారి జాబితా, ఇతర జిల్లాల్లో చదువుతున్న విద్యార్థుల జాబితా తయారు చేయాలని ఆదేశించారు. బడి బయట ఉన్న వారిని విధిగా బడిలో చేర్పించాలని, వారు నిరంతరం పాఠశాలకు వెళ్లాలని ఆయన స్పష్టం చేశారు. సర్వేలో నాణ్యత ఉండాలని, శత శాతం స్థూల నమోదు నిష్పత్తి ఉండాలని ఆయన అన్నారు. 2023 – 24 విద్యా సంవత్సరంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఇంటర్మీడియట్ వరకు శతశాతం స్థూల నమోదు నిష్పత్తి జరగాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్. ప్రేమ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్ర రావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు

ప్రజాశక్తి – గరుగుబిల్లి

ప్రకృతి వ్యవసాయం మన జీవన విధానం కావాలని అదేవిధంగా ఈ వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రాబర్ట్ పాల్ అన్నారు. మండలంలోని సంతోషపురంలో బుధవారం మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రతి సహజ వనరులను ఉపయోగించుకోవాలని, అవసరమైన చోట కషాయాలు, ద్రావణాలు ఉపయోగించాలన్నారు. ఆర్‌బికె సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ వరి పంటలు పండిస్తున్న రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించుకోవాలని సూచించారు. వ్యవసాయశాఖ ఎడి ఎ.నిర్మలాజ్యోతి మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం వల్ల రైతులకు ఎంతో మేలు అన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఎడి ఆర్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి రేగిడి విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక శ్రద్ధ : ఎస్‌పి

ప్రజాశక్తి– పార్వతీపురం రూరల్

జిల్లాలో నేరాల అదుపుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. బుధవారం పోలీస్ అధికారులతో స్థానిక పోలీసు కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాలులో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్ధ సంవత్సర నేర సమీక్షా సమావేశం నిర్వహించి, గత అర్ధ సం.లో నమోదైన, దర్యాప్తులో ఉన్న తీవ్రమైన నేరాల కేసులను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, ఎన్‌డిపిఎస్, ఐటి యాక్ట్ కేసులు, మహిళలపై జరిగే అన్యాయాలు, ప్రాపర్టీ దొంగతనాలు వంటి కేసుల గురించిన వివరాలు సమీక్షించారు. పోక్సో చట్టం, దిశా మొబైల్ యాప్ పట్ల విద్యార్థినులకు, మహిళలకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలలు సందర్శించి, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టి, రోడ్ భద్రతా నియమాలపై వినూత్న రీతిలో అవగాహన కల్పించి వాహన తనిఖీలు చేపట్టాలని, ఎంవి నిబంధనలు అతిక్రమించిన వారిపై చలానలు విధించాలని, బైకు, ఇళ్ల దొంగతనాలు జరగకుండా ప్రత్యేక దష్టి పెట్టాలని, అక్రమ మద్యం అరికట్టేలా చర్యలు తీసుకోవాలని, అదృశ్యం కేసుల్లో దర్యాప్తు చేసి, తప్పిపోయిన వారిని పట్టుకోవాలని, ప్లాన్ ఆఫ్ యాక్షన్, క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ తో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాబోయే లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. పిటి కేసుల స్థితిగతులను పరిశీలించి, సమగ్ర దర్యాప్తు చేసి, కోర్టు విచారణ సమయంలో ముద్దాయిలు, బాధితులు, సాక్షులంతా హాజరయ్యేలాగా చూసుకోవాలన్నారు. సారిపల్లిలోని పోలీసు శిక్షణ కేంద్రంలో నిర్వహించిన అర్థ సంవత్సర ఫైరింగు ప్రాక్టీసులో జిల్లాలో పని చేస్తున్న అధికారులు పాల్గొని, ఫైరింగు ప్రాక్టీసు చేయగా, ఈ ఫైరింగు ప్రాక్టీసులో ప్రతిభ కనబర్చిన డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్ సిఐ సిఎచ్. లక్ష్మణరావు ప్రధమ స్థానంలోను, డిసిఆర్బీలో ఎస్ఐగా పని చేస్తున్న వి. పాపారావు ద్వితీయ స్థానం, ఎఎస్పీ సునీల్ షారోన్ తృతీయ స్టానంలో నిలవగా, వారిని ం అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసారు. అలాగే విధులను సమర్ధవంతంగా నిర్వహించిన, కేసులు పురోగతిని సాధించడంలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులను అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసారు. సమావేశంలో ఎఎస్‌పి సునీల్ షరోన్, డిఎస్పీలు జివి కృష్ణారావు, జి .మురళీధర్, బడే వెంకట నాయుడు, పలువురు సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా బైక్ ర్యాలీ

ప్రజాశక్తి – సాలూరురూరల్

మణిపూర్‌లో జరుగుతున్న వరుస ఘటనలకు నిరసనగా మండలంలోని కూరుకుట్టి నుండి మామిడిపల్లి వరకు ట్రైబల్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెలోషిప్ ప్రతినిధి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా మణిపూర్‌లో సభ్య సమాజం తలదించుకునేలా గత ఆరు నెలలుగా అక్కడ రెండు తెగలు మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా కొన్ని అసాంఘిక శక్తులు విచక్షణ రహితంగా దాడులు జరిపి ఇళ్లలను చర్చిలను తగలబెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై అఘాయిత్యాలు, మానభంగాలు జరిపి హత్యలు జరుగుతున్నా అక్కడ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. రాజ్యాంగం ప్రకారం అన్ని మతాల వారు స్వేచ్ఛగా బతకడానికి హక్కులను కాపాడాల్సిన బాధ్యత అక్కడ ప్రభుత్వాలపై ఉన్నాయని, ఇటువంటి చర్యలను ప్రతి ఒక్కరూ తీవ్రంగా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు పాస్టర్ పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన గ్రామాల్లో రహదారులు మరమ్మతులు చేపట్టి గిరిజన ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు అధికారులకు కోరారు. మరమ్మతులకు గురైన మండలంలోని నీలకంఠాపురం నుంచి పోకిరి భీంపురం గ్రామానికి వెళ్లే రోడ్డును బుధవారం ఆయనతో పాటు సిపిఎం మండల కార్యదర్శి ఎం. శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఇటీవల పడిన వర్షాలకు రహదారులు పాడై గిరిజన ప్రజలు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంతేకాక ఆరోగ్యాలు బాగోలేక అత్యవసర సమయంలో 108 వాహనం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని, కావున సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.


అధ్వానంగా ఉన్న పోకిరిభీంపురం వెళ్లే రోడ్డు

2న జీడిపిక్కలు వేలం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

పార్వతీపురం అటవీ జిల్లా పరిధిలో సెప్టెంబర్ 2న 16 వందల కిలోల జీడి పిక్కలు వేలం నిర్వహించనున్నట్టు జిల్లా అటవీ అధికారి జి.ఎ.పి.ప్రసూన తెలిపారు. ఈ మేరకు బుధవారం జిల్లా అటవీ అధికారి ప్రసూన ఒక ప్రకటనలో తెలిపారు. పాలకొండ డివిజన్ వండువలో 2023 సీజన్‌కు సంబంధించి 60 హెక్టార్ల విస్తీర్ణంలో 16 వందల కిలోల జీడి పిక్కలు వేలం ద్వారా విక్రయానికి ఉన్నాయని, ఆసక్తి కలిగిన వారు పార్వతీపురం అటవీ కార్యాలయంలో సెప్టెంబర్ 2న జరిగే వేలంలో పాల్గొని కొనుగోలు చేయవచ్చునని ఆమె తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై ట్రైయినీ ఐఎఎస్‌ల అధ్యయనం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పూతికవలసలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై ట్రైనీ ఐఎఎస్‌ల బృందం అధ్యయనం చేసింది. ప్రకృతి వ్యవసాయం విభాగం నుంచి రీజినల్ అధికారి ప్రకాష్, డిపిఎం హేమసుందర్, షణ్ముఖరాజు కషాయాలపైన, ద్రావణాలపైనా డెమో నిర్వహించారు. అలాగే బీజామృతం, ద్రవ అమృతం విత్తన గుళికలపైన అవగాహన కల్పించారు. దీనివల్ల వచ్చిన దిగుబడులు భూసార పరిస్థితి గురించి తెలిపారు. బృందంతో పాటు రైతులకు కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం ధనుంజయ, జడ్‌పిఎం సభ్యులు బాలు తదితరులు పాల్గొన్నారు.

108 వాహన సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి -పాలకొండ

స్థానిక ఏరియా ఆస్పత్రి ఆవరణలో గల 108 డివిజన్ కార్యాలయంలో ఆ సిబ్బందికి వాహనం రెండురోజుల పాటు శిక్షణ నిర్వహించారు. 108 ఇఎంటిలకు నూతన కార్డిక్ వాస్కులర్(హృద్రో రోగాలు) ఎమర్జెన్సీస్‌లో ఎలా రక్షణ కల్పించాలి అనే అంశాలు గురించి శిక్షణ, తరగతులు ఇఎంటిలకు 108 జిల్లా మేనేజర్ మన్మధనాయుడు అవగాహనకల్పించారు. కార్యక్రమంలో పాలకొండ డివిజన్ ఒఇబి విజయకుమార్, ఒజెటి అలుబిల్లి శ్రీనివాసరావు గారు గుండెపోటుకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో 26 మంది ఇఎంటిలు పాల్గొన్నారు.

ఇస్రో అప్రెంటీస్‌కు సాలూరు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - సాలూరు


ఇస్రో అప్రెంటిస్ షిప్‌కు మండలంలోని చీపురువలసకు ఐటిఐ విద్యార్థి సర్లంగి యుగంధర్ ఎంపికయ్యారు. యుగంధర్ పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐలో 2019-21 సంవత్సరంలో రిఫ్రిజిరేషన్ అండ్ టివి గ్రూపులో చదువుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ వి.రవికుమార్, సిబ్బంది యుగంధర్ ని అభినందించారు.

భద్రగిరి ఐటిఐలో మూడో విడత కౌన్సెలింగ్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో మిగిలి ఉన్న సీట్లకు గాను బుధవారం కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ సునీల్ కుమార్ తెలిపారు. ఐటిఐలో వివిధ విభాగాల్లో 168 సీట్లు ఉండగా, ఇప్పటి వరకు 129 సీట్లు భర్తీ అయినట్లు ఆయన చెప్పారు. మరో 30 డ్రస్ మేకింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

సీతంపేట : స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మూడో విడత కౌన్సిలింగ్ ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ బుధవారం నిర్వహించారు. 182 మంది విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేయగా మెరిట్ ప్రాతిపదికన 28 మందికి ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో బోధకులు, సూపరిండెంట్ తదితరులు పాల్గొన్నారు.


డికెపట్నంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు విజయచంద్ర, జగదీష్

డికె పట్నంలో ' భవిష్యత్తు గ్యారెంటీ'

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని డికె పట్నం పంచాయతీ పరిధిలోని బుదురువాడ, ఆడారులో టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్చార్జి బోనాల విజయచంద్ర ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్‌తో కలిసి ఆయన గిరిజన గ్రామాల్లో పర్యటించి టిడిపి ప్రభుత్వం అమలు చేయబోయే మహాశక్తి భవిష్యత్తు గ్యారెంటీ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి వివరించారు. కార్యక్రమంలో నాయకులు బోను చంద్రమౌళి, జి.వెంకటనాయుడు, ఘంటా సాయిరాం, శంకర్, గురజాన లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై డాక్యుమెంట్ రైటర్ల వినతి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

డాక్యుమెంట్ రైటర్లు తమ సమస్యలను పరిష్కరించాలంటూ బుధవారం స్థానిక సబ్ రిజిస్టర్ సత్యనారాయణకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త విధానం అమలులోకి తీసుకురావడంతో తామంతా వీధిన పడతామన్నారు. కార్డు 2.0 విధానం అమలు చేస్తే తమకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పాత విధానమే అమలు చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం పరిసర ప్రాంతాల్లో ఇటీవల నాటుసారాతో పట్టుబడిన మూడు ద్విచక్ర వాహనాలు రూ.52,192కు వేలంపాటలో వెళ్లినట్లు ఎస్ఇబి ఎస్ఐ నాగభూషణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం బజాజ్ పల్సర్, ఎక్స్ఎల్, ప్లెజర్ స్కూటర్లను వేలంపాట నిర్వహించామన్నారు. ఈ మూడు ద్విచక్ర వాహనాలు రూ.52,192కు వెళ్లాయని అన్నారు . కార్యక్రమంలో ఎస్ఇబి సిబ్బంది, వేలంపాటదారులు పాల్గొన్నారు.


వాహనాలను వేలం వేస్తున్న ఎస్ఇబి అధికారులు

పనులు వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఇంకా ప్రారంభం కాని ఇంజనీరింగ్ పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. బుధవారం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎపిఇపిడిసిఎల్, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పురోగతిలో ఉన్న పనులను పూర్తి చేయాలని సూచించారు. హౌసింగ్ లే అవుట్లలో నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. జల జీవన్ మిషన్ పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవనాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులు, డిఇలు లోకనాథం, ఢిల్లీశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిజిఎంపి పనులు వేగవంతం చేయాలి

పార్వతీపురం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులు వేగవంతం చేయాలని పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్ అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులు ప్రగతిపై పార్వతీపురం, కొమరాడ మండల అధికారులతో ఐటిడిఎ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులకు బిల్లులు వెంటనే చెల్లింపు జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఆయా పనుల ప్రాధాన్యత ఉందని దాని దృష్ట్యా వేగవంతం చేయాలని అన్నారు. మెటీరియల్ సరఫరా, ఇతర అంశాల పట్ల స్పష్టమైన కార్యాచరణ ఉండాలన్నారు. వర్షాలకు ముందుగానే పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి కావాలని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి


తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ఇళ్లు

ఆక్రమణలను అడ్డుకోలేని రెవెన్యూ అధికారులు

టిడిపి నాయకులు మావుడి

ప్రజాశక్తి -మక్కువ

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం పరిసరాలంతా ఆక్రమణలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని మండల టిడిపి నాయకులు మావుడి ప్రసాదరావునాయుడు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి హద్దుల్లేకుండా పోయాయని, దీన్ని ఆసరాగా తీసుకుని కబ్జాదారులు రెచ్చిపోతున్నారని అన్నారు. కళ్ల ఎదుట ప్రభుత్వం స్థలం కబ్జా అవుతున్నా అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాల ఆక్రమణ వెనుక కొంతమంది రెవెన్యూ ఉద్యోగులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మండల కేంద్రంలో జరుగుతున్న పలు ఆక్రమణలపై ఇప్పటికే రెవిన్యూ అధికారులను సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగామన్నారు. అలాగే జగనన్న కాలనీలో పేదల కంటే పెద్దలకే కేటాయించారని, వాటిపై కూడా సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగామని తెలిపారు. ఇదిలా ఉండగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం పరిసరాల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలు గురించి తాము ఎవరికీ పట్టాలు ఇవ్వలేదని, గతంలో ఎవరైనా ఇచ్చి ఉంటే ఆధారాలు చూపాలని అడగడం జరిగిందని తహశీల్దార్ ఎ.సూర్యనారాయణ 'ప్రజాశక్తి'కి తెలిపారు. ప్రస్తుతం ఏ విధమైన నిర్మాణాలు జరగకుండా నిలిపివేశామన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు పాచిపెంట మండల నాయకులు ఈశ్వరరావు

తొమ్మిదో రోజుకు జ్యూట్ కార్మికుల దీక్షలు


ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని జీగిరాం జ్యూట్ మిల్ వద్ద జెఎసి నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షలకు సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, చింత పోలిరాజు మద్దతు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ 15 నెలలుగా మూత బడి ఉన్న ఎపి ఫైబర్ జూట్ మిల్లును వెంటనే తెరిపించి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించి, అన్ని విధాలా ఆదుకోవాలని అన్నారు. యాజమాన్యం లాక్‌డౌన్ ప్రకటించిన తర్వాత ఇదే జూట్ మిల్లుపై ఆధారపడి జీవిస్తున్న 1500 కుటుంబాలు, మరో వెయ్యి కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు మూసి ఉన్న పరిశ్రమలు తెరిపిస్తానని హామీలు ఇచ్చి ఒక్క పరిశ్రమను తెరిపించలేదని, దీనివల్ల ఉపాధి అవకాశాలు లేక అనేకమంది వలసలు పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన ఒకే ఒక్క జూట్ మిల్లు తెరిపించే బాధ్యత డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర తీసుకొని మిల్లును తెరిపించేలా చర్యలు తీసుకొని, కార్మికులను ఆదుకోవాలని కోరారు. పార్టీలకు అతీతంగా ప్రజలు కూడా సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మూత బడి వున్న పరిశ్రమలు తెరిపించాలని కోరారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు సిద్దాబత్తుల సింహాచలం, పువ్వల శ్రీనివాసరావు, గొల్లి సన్యాసిరావు, రెడ్డి సింహాచలం, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

16,17 తేదీల్లో గిరి ఒలింపిక్స్

ప్రజాశక్తి - సీతంపేట

ఉత్తరాంధ్ర జిల్లాల్లో సెప్టెంబర్ 16, 17 తేదీల్లో గిరి ఒలింపిక్స్ బ్యాడ్మింటెన్ టోర్నమెంట్ ఛాంపియన్ షిప్ క్రీడలు స్థానిక ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్ జాకబ్ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు క్రీడాకారులకు భోజనం వసతి సౌకర్యం కల్పించబడునని తెలిపారు, విజేతలకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. అండర్-17 యువకులు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8500482433 ఈ నెంబర్ సంప్రదించాలని కోరారు.


వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డిఐఒ జగన్మోహనరావు

ప్రజారోగ్యం పట్ల అంకిత భావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

ప్రజల ఆరోగ్యం పట్ల అంకిత భావంతో వైద్యాధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు అన్నారు. స్థానిక పిహెచ్‌సిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి రోజూ ఆసుపత్రికి వస్తున్న రోగుల ఆరోగ్య వివరాలకు సంబంధించిన ఓపి, ఐపి రికార్డులు పరిశీలించారు. ఎటువంటి అనారోగ్య లక్షణాలతో ఎక్కువగా వస్తున్నారు, ఏ విధమైన చికిత్స అందజేస్తున్నారు తదితర అంశాలపై వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అదేవిధంగా అత్యవసర పరిస్థితుల్లో అదజేస్తున్న మందులు, చికిత్స వివరాలు అడిగారు. ఎఎస్‌వి ఇంజెక్షన్లు పిహెచ్సిలో అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం డాక్టర్ జగన్మోహనరావు వ్యాక్సిన్ నిల్వల నిర్వహణ రికార్డులు పరిశీలించారు. టీకా వేయబడని పిల్లలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కె.శిరీష, సూపర్ వైజర్స్ సింహాచలం, జయగౌడ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

వాలంటీర్‌ను తొలగించండి

ప్రజాశక్తి -కొమరాడ

ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమాలు చేస్తున్న వాలంటీర్లను తొలగించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. మండలంలోని కుంతేసు పంచాయతీ గూనకళ్లు గ్రామవాలంటీర్ కె.హేమారావును తక్షణమే తొలగించాలని బుధవారం స్థానిక ఎంపిడిఒ మల్లికార్జునరావుకు గూనకళ్ళు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆ గ్రామస్తులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయం వాలంటీర్ వ్యవస్థ మారుమూల గ్రామాల్లోని సైతం నిరుపేదలపైనా, మహిళలపైనా అసభ్యకరంగా ప్రవర్తించడమే కాక మీరు డబ్బులు ఇవ్వకపోతే మీకు అమ్మవడి చేయూత, పింఛన్ల పథకాలు రాకుండా చేస్తానని, వాలంటీర్ ప్రవర్తించడం సరైన పద్ధతి కాదన్నారు. ఏదైనా సమస్య తెలియజేస్తే మీరు మీ దిక్కున చోట చెప్పుకోండి అంటున్నాడని అంతేకాకుండా జగనన్న సురక్ష సమావేశాల్లో ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాలు, రాబడి ధ్రువీకరణ పత్రాలు అధికారులు ఉచితంగా అందచేశారని, అప్పుడు తమకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు చేయలేదని తెలిపారు. ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లు అడుగుతాడని వచ్చినా అతనికి లంచం ఇవ్వాలని, లేకపోతే మీ పింఛను తొలగిస్తాం, రేషన్ కార్డు తొలగిస్తానని బెదిరిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఆరుగురి పింఛన్ సొమ్మును రూ.లక్షా 30 మింగేసినట్లు ఫిర్యాదులు తెలిపారు. ఈ ఫిర్యాదు ఇచ్చిన వారిలో గ్రామానికి చెందిన చోడి జగ్గారావు, కొండగొర్రి బీమారావు, గుంట సుమంత్, కంద్రక రెల్లి, కద్రక ఆసియా, మీనక కృష్ణారావు, తదితరులు తెలిపారు.

నిత్యావసర సరుకులు సకాలంలో పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రేషన్ కార్డుల వినియోగదారులకు సకాలంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసిల్దార్ ఎచ్చెర్ల మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రేషన్ షాపుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాలకు కేటాయించిన ఎండియు వాహనాల ద్వారా ప్రభుత్వ నిర్దేశించిన సమయంలోగా రేషన్ కార్డుల వినియోగదారులకు సరుకులను పంపిణీ చేయాల్సి ఉందన్నారు. సరుకుల పంపిణీలో జాప్యం జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రేషన్ షాపుల వద్ద సరుకుల వారీగా ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో తహసిల్దార్ కార్యాలయం జూనియర్ సహాయకులు జి.తేజేశ్వరరావు, డీలర్ల సంఘం మండల అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, ఎం.బి.రూపానందం, అక్కేన హరినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సింధునగర్‌లో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని సింధూనగర్ గిరిజన గ్రామంలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతి కుమారి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



నిలిచిపోయిన బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

బ్రిడ్జి పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక సువర్ణముఖీ నదిపై కొత్తగా నిర్మిస్తున్న ఆర్ అండ్ బి బ్రిడ్జి నిర్మాణ పనులు మధ్యలో ఆగిపోవడంతో వాటిని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ బుధవారం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్రిడ్జి నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరైందని, నిర్మాణ పనులు రూ.నాలుగున్నర కోట్ల వరకు కాంట్రాక్టు జరపారని, మధ్యలో పనులు ఆపేశారని అన్నారు. దీంతో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను కలిసి వినతి పత్రం అందజేశానన్నారు. ఆయన స్పందించి రూ.3.50 కోట్లు నిధులు మంజూరు చేశారన్నారు. పెండింగ్ బిల్లులు పూర్తి చేయడంతో వెంటనే పనులు ప్రారంభించి ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. కొత్త సంవత్సరంతో కొత్త బ్రిడ్జి ప్రారంభించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని ఈ లక్ష్యానికి అనుగుణంగా కాంట్రాక్టర్లు, అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు. ఆయన వెంట పెదభోగిలి ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్, వార్డు మెంబర్లు పిన్నింటి రామారావు, బురిడి రామారావు, వైసిపి నాయకులు జి.వెంకటనాయుడు, ఎస్.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెట్టాలి

ప్రజాశక్తి - కొమరాడ

వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని గిరిజన సంక్షేమ శాఖ ఎటిడబ్ల్యూ బి.సురేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ భాలికోన్నత పాఠశాల, ఉలిపిరి గిరిజన సంక్షేమాశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా వసతిగృహంలో వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం స్టోర్‌రూమ్‌లో ఉన్న సామాగ్రికి రికార్డులను నమోదు చేసిన అంశాలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు వండి పెట్టే భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మెనూ అమలు చేస్తుందన్నారు. విద్యార్థులకు మినీ ప్రకారం మూడు పూటలా భోజనంతో పాటు పండ్లు, స్వీట్లు, స్నాక్స్ సక్రమంగా అందజేయలన్నారు. భోజనం వండే సమయంలో వంట దగ్గరకు వెళ్లి వార్డెన్లు బాధ్యతగా పర్యవేక్షించాలని సూచించారు. భోజనం వండేటప్పుడు ఎటువంటి నిర్లక్ష్యం ఊహించకుండా రుచిగా నాణ్యమైన భోజనాన్ని ఉండాలని నిర్వాహకులకు సూచించారు. వసతి గృహాల్లో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వస్తారు కాబట్టి రికార్డులన్నీ సక్రమంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. నాణ్యత పాటించకుండా మెనూ అమలు చేయకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం భోజనం సక్రమంగా పెడుతున్నారా లేదా అన్న వివరాలు విద్యార్థినిలకు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు వార్డెన్లు ఉన్నారు.


బాలికోన్నత పాఠశాలలో స్టాక్‌ను పరిశీలిస్తున్న ఎటిడబ్ల్యుఒ సురేష్‌కుమార్

పరిశ్రమకు స్థలం కేటాయించొద్దు


ప్రజాశక్తి- గరుగుబిల్లి

నిరుపేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం కేటాయించిన స్థలాన్ని పరిశ్రమకు కేటాయించొద్దని మండలంలోని నాగూరు సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, అచ్యుతరావు బుధవారం స్థానిక తహశీల్దార్ గేదెల వెంకట జనార్ధన్‌కు వినతిపత్రంను అందజేశారు. నాగూరు సమీపంలో గతంలో ఇళ్ల స్థలాలకు కేటాయించిన దాదాపు 5 ఎకరాల విస్తీర్ణంలో ఎం.ఎస్.ఇ పిడిపి పథకం కింద ఇంద్రాణి క్లస్టర్ రైస్ మిల్ అసోసియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున కామన్ ఫెసిలిటీ నిర్మాణానికి కేటాయించనట్లు ఇందుకు సంబంధించి గ్రామపంచాయతీ తీర్మానం ఇవ్వాలని ఆర్ఐ తమకు తెలిపారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. సర్వేనెంబర్ 102/1లో గల భూమి నిరుపయోగంగా ఉందని ఎవరు ధ్రువీకరించారో తమకు తెలియదని, ఈ విషయంపై గ్రామపంచాయతీ తరపున అభ్యంతరం తెలియజేస్తున్నామని సర్పంచ్, గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలో దాదాపు 40 రజక కుటుంబాలు ఉన్నాయని, వారు ధోబీఖానాలను నిర్మించుకునేందుకు కొంత స్థలాన్ని కేటాయించేందుకు ఇప్పటికే గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం చేశామన్నారు. ఈ విషయంను ఉన్నతాధికారులు పరిశీలించి కామన్ ఫెసిలిటీ నిర్మాణానికి పేదల ఇళ్ల స్థలం కేటాయించకుండా ఉండాలని కోరారు.

కిమ్మి రహదారి నిర్మాణంలో నాణ్యతా లోపాలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మి గ్రామ వంతెన వద్ద గల రహదారికి నాణ్యతా ప్రమాణాలు లోపించాయి. రహదారి నిర్మాణ పనులు చేపట్టి సుమారుగా రెండు నెలలు కూడా పూర్తి కాలేదు. పనులు జరిగేటప్పుడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాలం చెల్లకు ముందే రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. ఇందులో భాగంగా కిమ్మి గ్రామ రహదారి అని ఒకటి చెప్పాలి. ఎన్నో ఏళ్లుగా కిమ్మి -రుషింగి గ్రామాల మధ్య నాగావళి నదిపై సుమారు రూ.20 కోట్ల అంచనా వ్యయంతో వంతెన చేపట్టారు. వంతెనకు అవతల ఇవతల అప్రోచ్ రోడ్లు వేసినప్పటికీ నాణ్యత ప్రమాణంలో పాటించకపోవడంతో బిటి రహదారి పగుళ్లు ఏర్పడ్డాయి. దీంతో రోడ్లు, భవనాల శాఖ సిమెంటుతో అద్ది, దానిపై నలుపు రంగు గల రంగును పూసి మామ అనిపించుకున్నారు. మరోవైపు రహదారికి అవతల ఇవతల రక్షణ గోడలు లేకపోవడంతో కురుస్తున్న వర్షాలు కారణంగా మట్టి కరిగిపోతుంది. ఇప్పటి అధికారులు రోడ్డు పనులను పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కరిగిపోతున్న రోడ్డు పక్క వేసిన మట్టి

చదరపు మీటరుకు 33 కుదుర్లు ఉండాలి

ప్రజాశక్తి - పాచిపెంట

సార్వా సీజన్లో ఒక చదరపు మీటరులో వరి పంట కుదుర్లు 33కి తక్కువ లేకుండా ఉండాలని అప్పుడే దిగుబడి బాగా వస్తుందని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లిలో ఏర్పాటు చేసిన డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన జిల్లాలో వరి పంట దిగుబడి తక్కువగా ఉండడానికి చదరపు మీటరు పరిధిలో ఉండాల్సిన మొక్కల సంఖ్య కంటే తక్కువ ఉండడం వల్ల దిగుబడి తక్కువగా వస్తుందని శాస్త్రవేత్తలు నిర్ధారించారని తెలిపారు. ఒక చదరపు మీటరులో 33 కుదుర్లు ఉండేలా ఒక్కో కుదురుకు రెండు లేదా మూడు మొనలు మాత్రమే ఉండేలా బురదపదునులో తేలికపాటి నాట్లు నారు చివర కొసలు తుంచి వరుసల్లో నాటుకుంటే సాంప్రదాయ రైతు పద్ధతి కంటే కనీసం మూడు, నాలుగు బస్తాల అధిక దిగుబడి సాధించవచ్చని, కావున రైతులు తప్పకుండా ఈ పద్ధతిని పాటించాలని కోరారు. కానీ రైతులు ఒక చదరపు మీటరులో 21 నుండి 24 కుదుర్లు మాత్రమే నాటుతున్నారన్నారు. అలాగే ఒక్కో కుదురుకు 7 నుంచి 8 పిలకలు నాటుతున్నారని, దీనివల్ల కంకులు వేసే పిలకల సంఖ్య తగ్గిపోతాయన్నారు. కంకలు ఎచ్చు గంజల సంఖ్య కూడా తగ్గడం వల్ల దిగుబడకూడా తగ్గుతుందని, కావున రైతులు ఈ విషయాన్ని గ్రహించాలని సరియైన యాజమాన్య పద్ధతులను అవలంబించాలన్నారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు సురేష్, రమణ, ౖతులు పాల్గొన్నారు.


వరి సాగు యాజమాన్యం పద్ధతులను రైతులకు వివరిస్తున్న ఎఒ తిరుపతిరావు

జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా లక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా డిప్యూటీ లైబ్రేరియన్ బిలక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి.. ఆమెకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ లలిత చేసిన అభివృద్ధిని కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా బాధ్యతలు తీసుకున్న లక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ సంస్థను ముందుకు తీసుకెళ్తానని చెప్పారు.